క్లుప్తంగా

నేడు చిన్నవరదాయపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్నవరదాయపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

25న అల్లాడుపల్లెలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

చాపాడు : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో ఈ నెల 25న సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయం వద్ద శుక్రవారం ఉదయం 8గంటల నుంచి నిర్వహించే వరలక్ష్మీ వ్రతానికి హాజరయ్యే మహిళలందరూ పూజా సామగ్రితో ఆలయం వద్దకు రావాలని ఆలయ ఈఓ తెలియజేశారు.

రాజరాజేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరిదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి శ్రావణమాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి నూతన పట్టు వస్త్రాలు, ఆభరణాలతో, పూలతో అలంకరించారు. ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి, చండీ మాతకు, సైకత లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పల్లె పల్లెకు శాంతి కార్యక్రమం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు విశ్వశాంతి నగర్ బ్రహ్మకుమారీస్ ఓంశాంతి వానప్రస్థాన ఆశ్రమంలో వారి ఆధ్వర్యంలో చెంచుపల్లెలో శుక్రవారం పల్లె పల్లెకు శాంతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన రాజయోగి గంగిరెడ్డి మాట్లాడుతూ ఆనందమయ జీవితాన్ని పొందడానికి రాజయోగం ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగా మార్గాల ద్వారా దుఃఖాన్ని దూరం చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సూర్య ప్రకాశ్, హ్యూమన్‌రైట్స్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ సాయికరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలింగ్



రాజుపాళెంలో ఎన్నికల కేంద్రం వద్ద అధికారులు

రాజుపాళెం : రాజుపాళెంలోని ఎస్సీ కాలనీలో 9వ వార్డుకు సంబంధించి శనివారం పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు పంచాయితీ కార్యదర్శి విజయమ్మ తెలిపారు. ఈ ఎన్నికలు రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. మొత్తం 204 ఓట్లు ఉండగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని, అనంతరం కౌంటింగ్ ప్రారంభం అవుతుందని అధికారులు చెప్పారు. ఎన్నికలు జరిగే ప్రాంతాన్ని ఎస్ఐ రాజగోపాల్, ఎంపీడీఓ సయ్యదున్నీసాలు పరిశీలించారు. ఏఎస్ఐ సుబ్బారెడ్డి నేతృత్వంలో ఏఆర్, సివిల్ పోలీసులు బందోబస్తు ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో అభిమానులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక శివాలయం సెంటర్, మైదుకూరు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న పేదలకు దుప్పట్లు అందించారు. అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు రామారావు, షరీఫ్, మధు చిరు రాయల్, చంద్రదర్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు కొనుగోలు అక్రమాలపై విచారణ జరపాలి

కడప వైఎస్సార్ సర్కిల్: పసుపు కొనుగోలు అక్రమాలపై విచారణ జరపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావుకు ఏపీ రైతు సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందుతున్నాయని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరు మండలం ఎన్.ఎర్రబల్లె సచివాలయ పరిధిలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని ఎన్.ఎర్రబల్లె, గంగాయపల్లె గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల వల్ల పొందిన లబ్ధిని ఆయన ప్రజలకు వివరించారు. అనంతరం రఘురామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో అభివృద్ధి, సంక్షేమం ఉండేది కాదన్నారు. నీరు – చెట్టు కింద కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, జన్మభూమి కమిటీల ద్వారా పచ్చ చొక్కాల వారికే పింఛన్లు, పక్కా ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. అందుకే ఇప్పుడు ప్రజల వద్దకు టీడీపీ వారు వెళ్లలేకున్నారని అన్నారు. డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేస్తే వైఎస్ జగన్ వడ్డీతో సహా డ్వాక్రా రుణాలను చెల్లిస్తున్నారన్నారు. ప్రజలను ఒకటే అడుగుతున్నామని వారి కుటుంబానికి, వారి ప్రాంతానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు జరిగింది అంటే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరొకసారి ఆదరించాలని కోరుతున్నట్లు తెలిపారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం ఏర్పడిందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎన్.ఎర్రబల్లె పంచాయతీ సుంకులుగారిపల్లెలో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను ఆయన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డిలతో కలసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ఇందులో రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు అనేక సౌకర్యాలను కల్పించారని తెలిపారు. ఆర్‌బీకేలో వ్యవసాయ ఉద్యాన సహాయకులతో రైతులకు పంటల సాగులో సూచనలు అందించడమేగాక నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలకు 40 రకాల వైద్య పరీక్షలు అందుబాటులోకి తెచ్చారన్నారు. టీడీపీ హయాంలో ఇలాంటి అభివృద్ధి లేదని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.గోవిందమ్మ, ఎంపీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మిదేవి, స్థానిక నాయకులు పెద్దిరెడ్డి దశరథరామిరెడ్డి, ఆదిబోయిన నారాయణ, ఎ.నాగేశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ పెరుగు రాయుడు, అన్నలూరు ఎంపీటీసీ గంగమ్మ, దప్పిలి సుబ్బరాయుడు, కుందేళ్ల వెంకటసుబ్బయ్య, డి.సుబ్బరాజు, పి.మనోహర్‌రెడ్డి, పి.లక్ష్మిరెడ్డి, నారాయణ, మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేష్టాది రవి, ఎంఎస్ఆర్, తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, వివిధ శాఖల ఏఈలు రామభద్రయ్య, భరత్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్, బ్రహ్మానందరెడ్డి, ఏఓ లక్ష్మిప్రసన్న, ఎంఈఓ పద్మలత, వైకేపీ ఏపీఎం సుజాత, ఉపాధి ఏపీఓ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ–ఆటోలను ప్రారంభించిన ఎమ్మెల్యే

మైదుకూరు : క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా మైదుకూరు మున్సిపాలిటీకి మంజూరైన ఆరు ఈ–ఆటోలను శుక్రవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ఆటోలకు పచ్చ జెండా ఊపి ఆయన ప్రారంభించారు. రెండు సచివాలయాలకు ఒక ఆటో వంతున మైదుకూరు మున్సిపాలిటీకి ఆరు ఆటోలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ–ఆటోల ద్వారా మున్సిపాలిటీలోని ఇంటింటికి వెళ్లి పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరిస్తారని తెలిపారు.

విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించండి

విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ



మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

మైదుకూరు : విద్యుత్ బకాయిల వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ అన్నారు. మైదుకూరు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఆయన డివిజన్ పరిధిలోని మైదుకూరు, బద్వేలు నియోజకర్గాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ బకాయిల వసూళ్లలో వినియోగదారులపై దయ చూపించే స్థితిలో లేమని, ఏ రోజుకు ఆ రోజు డబ్బులు చెల్లించి విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. అందువల్ల విద్యుత్ బకాయిలను 100 శాతం వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయాలు అధికంగా ఉన్నాయని లైన్లలో తిరిగి సమస్యలను గుర్తించి, మరమ్మతులు చేసి అంతరాయాలను అరికట్టాలన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఆదేశించారు. పగటి పూట వీధి లైట్లు వెలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త వ్యవసాయ సర్వీసులకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉందని, రైతులు కొత్త సర్వీసు కోసం నమోదు చేసుకున్న వెంటనే అంచనా వేసి సర్వీసులను ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటి పూట 9 గంటల నిరంతరాయమైన ఉచిత విద్యుత్‌ను ఎటువంటి జాప్యం లేకుండా ఇవ్వాలని తెలిపారు. జగనన్న కాలనీల్లో ఎవరికైనా విద్యుత్‌సర్వీసు కావాలంటే యుద్ధ ప్రాతిపదికన మీటర్ బిగించి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూడాలన్నారు. వినియోగదారులపట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ సంస్థపై సంతృప్తికర అభిప్రాయాన్ని పెంచాలని ఆదేశించారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని పేర్కొన్నారు. అవసరమైన చోట పల్లెనిద్ర కూడా చేసి పనులు చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మైదుకూరు ఈఈ జీవీ రామిరెడ్డి, డీఈఈలు, ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



ధాన్యం నిల్వ చేసుకునేందుకు భవనం నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి ఆనంద్

రాజుపాళెం : మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి డి.ఆనంద్‌నాయక్ సూచించారు. రాజుపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణ రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఆనంద్ నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, జగనన్న పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సయ్యదున్నీసా, తహసీల్దార్ ఇందిరా రాణిలకు సూచించారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్ ఏ స్టేజీలో ఉన్నాయో తెలుసుకున్నారు. వాటిని వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పొదుపు సంఘాల ద్వారా పక్కా గృహాలు నిర్మించుకునే వారికి రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. పొదుపు సంఘాలకు రుణాల మంజూరు, సున్నా వడ్డీ, సంఘాల అభివృద్ధిపై వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం జయరాజ్, సీసీలతో మాట్లాడారు. అనంతరం ధాన్యపు నిల్వ చేసుకునేందుకు నిర్మాణం కోసం మండల కాంప్లెక్స్ ఆవరణంలో స్థలాన్ని పరిశీలించారు. ఆ భవనాన్ని నిర్మించేందుకు రూ.13 లక్షలు మంజూరైందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు పంటలు సాగు చేయలేక పోతున్నారని సాగునీరు ద్వారా పంటలు పండించుకునేందుకు సహకారం అందించాలని మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణ రెడ్డి ... ఆనంద్ నాయక్ దృష్టికి తీసుకొచ్చారు. అందుకోసం మైలవరం కాలువలో జమ్ము, పూడిక తీత పనులు చేపడితే చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందని ఎంపీపీ చెప్పారు. దీనిపై ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చి అంచనాలు వేయించామన్నారు. ఈ విషయంపై ఆనంద్ నాయక్ ఇరిగేషన్ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరగా ఆ పనులను మంజూరు చేయిస్తానని ఎంపీపీకి తెలిపారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర రెడ్డి, సీసీ గౌస్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



సీఐలకు సూచనలు ఇస్తున్న ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : పంచాయతీ ఉప ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. ప్రొద్దుటూరు మండలంలోని కొత్తపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న 13 వార్డు (మత్స్యకాలనీ), తాళ్లమాపురం పంచాయతీలోని 1వ వార్డు (మూలవారిపల్లె) లకు శనివారం ఉప ఎన్నికలు జరుగనున్నాయి. మూలవారిపల్లెలో 350, మత్స్యకాలనీలో 1170 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలకు ఏఎస్పీ ప్రేరణా కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఎన్నికలు జరుగనున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సీఐలు, ఎస్ఐలకు సూచనలు చేశారు. ఉప ఎన్నికల నిర్వహణ కోసం 140 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. డీఎస్పీతో పాటు నలుగురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలను నియమించామన్నారు. మత్స్యకాలనీ, యానాది కాలనీ, మూలవారిపల్లె పంచాయతీల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలన్నారు. ఎన్నికలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. ఏఎస్పీ వెంట సీఐలు ఇబ్రహీం, రాజారెడ్డి, నారాయణయాదవ్, యుగంధర్ పాల్గొన్నారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోండి

రాజుపాళెం : రాజుపాళెంలో 9వ వార్డుకు సంబంధించి శనివారం జరగబోవు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఏఎస్పీ ప్రేరణ కుమార్ ఓటర్లకు సూచించారు. ఆ వార్డులో శుక్రవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. ఏఎస్పీతోపాటు ఎస్ఐలు రాజగోపాల్, సురేష్, పోలీసులు పాల్గొన్నారు.

సాయి హర్షితకు అభినందనలు



సాయి హర్షిత, ఆమె తల్లిదండ్రులను అభినందిస్తున్న తొగట వీర క్షత్రియులు

ప్రొద్దుటూరు కల్చరల్ : డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన వంకం సాయి హర్షిత, ఆమె తల్లిదండ్రులు వంకం వెంకటసుబ్బయ్య, శారదలను మేదరవీధిలోని రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం తొగట వీరక్షత్రియులు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయి హర్షిత కష్టపడి చదివి డిప్యూటీ కలెక్టర్ సాధించడం అభినందనీయమన్నారు. ఆమె తండ్రి వెంకటసుబ్బయ్య ఫ్రిడ్జ్ మెకానిక్‌గా ఉండి బాగా చదివించారన్నారు. సాయిహర్షిత మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎగువ అహోబిళ తొగటవీరక్షత్రియ అన్నసత్రం కమిటీ అధ్యక్షుడు పల్లా శేషయ్య, కోశాధికారి నాగమయ్య, కార్యదర్శి పల్లా శంకర్ నారాయణ, తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, ఉమ్మడిశెట్టి ప్రకాష్, లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన సాయిహర్షితను 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా సన్మానించారు. శుక్రవారం కౌన్సిలర్ స్థానిక మేదరవీధిలోని వారి ఇంటికి వెళ్లి సాయిహర్షిత, ఆమె తల్లిదండ్రులు వెంకటసుబ్బయ్య, శారదను శాలువా కప్పి సన్మానించి స్వీట్లు తినిపించారు. సాయిహర్షిత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతో ఉపయోగపడిందన్నారు. ఆయనను ఎన్నటికీ మరువమని తెలిపారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పోరుమామిళ్ల : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ పోరుమామిళ్ల మండలంలో దాదాపు 500 మంది ఆటో కార్మికులు ఉన్నారని, బాడుగ ఇండ్లలో కరెంటు బిల్లులు కూడా చెల్లించలేని దయనీయస్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం వారికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. ఇంటి స్థలం ఇవ్వాలన్నారు.

పీఈటీలు ఆధునికతను అందిపుచ్చుకోవాలి

ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

మైదుకూరు : వ్యాయామ ఉపాధ్యాయులు ఆధునికతను అందిపుచ్చుకొని విద్యార్థులను గొప్ప క్రీడాకారులుగా తయారు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మైదుకూరులో కడప ఉమ్మడి జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావం, నిరంతరం పరిశ్రమ చేసే అలవాటును వ్యాయామ ఉపాధ్యాయులు ప్రోది చేయాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది పాఠశాల క్రీడలకు తగినన్ని నిధులు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కిరణ్, శ్రీకాంత్, రెడ్డి, రాష్ట్ర బాధ్యులు రమేష్ యాదవ్, నిత్య ప్రభాకర్, సాజిత్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అరుణకుమారి, అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వసంతకుమారి, వీరాంజనేయులు, శివశంకర్‌రెడ్డి, ఓబయ్య, మేధా డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


నేషనల్ వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం, అడ్వాన్స్‌డ్ సైకలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ వర్క్‌షాపునకు సంబంధించిన పోస్టర్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఆవిష్కరించారు. శుక్రవారం వైవీయూలో పీజీ కళాశాల ప్రిన్సిపాల ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. లలిత, సహ ఆచార్యులు డా. వి. లాజరస్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి చక్కటి పరిష్కారాలు చూపేలా వర్క్‌షాపు నిర్వహించాలని సూచించారు.


భక్తుల కొంగుబంగారం కొండగోపాలస్వామి



కొండగోపాలస్వామి



కొండగోపాలస్వామి ఆలయం



ఆలయ సమీపంలో జాలువారే నీటి జలపాతం

నేడు శ్రావణమాస మొదటి శనివారం

అట్లూరు : సుమారు నాలుగు వందల ఏళ్ల నాటి కొండగోపాలస్వామి ఆలయం నేటికీ భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతోంది. మండల పరిధిలోని కొండూరు పొలిమేర శ్రీలంకమల్లేశ్వర అభయారణ్యంలో వెలసిన శ్రీ కొండగోపాలస్వామి ఆలయం కడప–బద్వేలు ప్రధాన రహదారి నుంచి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో వెలసి ఉంది. అయితే మట్లిరాజులు సుమారు నాలుగువందల సంవత్సరాల క్రితం ఈ ఆలయం నిర్మించినట్లు చరిత్ర కారులు చెబుతున్నారు. ఆలయం చుట్టూ పచ్చని చెట్లతో నిండిన ఎతైన కొండలు, లోతైన జలపాతం నీటి గుండాలతో ఆహ్లాదకరమై ఉంటుంది. అయితే ప్రతి ఏటా శ్రావణమాసంలో వచ్చే నాలుగు శనివారాలలో ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. అట్లూరు మండల ప్రజలు ఆరాధ్యదైవంగా కొలుస్తారు. జిల్లా నలుమూలలనుంచే కాకుండా నెల్లూరు, చిత్తూరు జిల్లాలు, బెంగుళూరు, హైదరాబాద్ నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. నేడు శ్రావణమాస మొదటి శనివారం కావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుంటారు. శ్రావణమాసంలో వచ్చే నాలుగు శనివరాలలో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటారు. వచ్చిన భక్తులకు ఆలయకమిటీ సౌఖర్యాలతో పాటు అన్నదాన కార్యాక్రమాలు నిర్వహిస్తారు.

కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో కనకదుర్గమ్మ అమ్మవారు

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాసోత్సవాలకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 19, 26, సెప్టెంబర్ 2, 9వ తేదీల్లో గండి వీరాంజనేయ క్షేత్రానికి బద్వేలు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు డిపో నుంచి ఆయా తేదీల్లో ఎక్స్‌ప్రెస్ బస్సు ఉదయం 5.30 గంటలకు బయలుదేరి గండి వీరాంజనేయ క్షేత్రం, కదిరి లక్ష్మీనరసింహస్వామి టెంపుల్, రాయచోటి వీరభద్రస్వామి టెంపుల్‌లలో దర్శనం చేసుకుని తిరిగి బద్వేలుకు చేరుతుందని, ఇందుకు టిక్కెట్ ధర రిజర్వేషన్‌తో కలిసి రూ.600లు నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9959225779, 7382867104 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

తిరుమల కాలినడక దారికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

పోరుమామిళ్ల : అలిపిరి నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తులకు రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రతినిధి బాలరంగయ్య కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హిందువులకు అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రం తిరుమల విషయంలో రాజకీయాలకు అతీతంగా భక్తుల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమల వెళ్లే భక్తులకు కాలినడక దారిలో చిరుతలు, ఎలుగుబంట్లు, పులుల సమస్య లేకుండా ఫెన్సింగ్ ద్వారా రక్షణ కల్పించాలన్నారు.

సుస్థిర వ్యవసాయంతో అధిక లాభాలు

మైదుకూరు : సుస్థిర వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మైదుకూరు మండలం వనిపెంటలో శుక్రవారం డీపీసీసీ, నాబార్డ్ ఏపీఆర్సీ సహాయంతో మహిళలకు సుస్థిర వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు హర్షిత, కాంతిశ్రీ మాట్లాడుతూ సుస్థిర వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వనిపెంట స్టేట్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ శ్రీహరి, జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ యశోద, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు బాలనరసింహారెడ్డి, డీపీసీసీ అధ్యక్షుడు కుమార్ రాజా, అభ్యుదయ రైతు రామానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

కడప వైఎస్సార్ సర్కిల్ : ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన ప్లీనరీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గండి సునీల్ కుమార్, జిల్లా కార్యదర్శిగా సగిలి రాజేంద్ర ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంఆర్ నాయక్, రాహుల్, వినయ్, సహాయ కార్యదర్శులుగా రవి కరిష్మాతో పాటు జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు.